

# నీకా శిక్ష చాలు

రేణుకారాణి

చీకటి జడలు విరియబోసుకుని చిందులేస్తూంది. నిశ్శబ్దం రాజ్యమేలుతూంది. కీచురాళ్ళ కంఠశోష తప్ప ఏమీ వినపడటం లేదు. ఆ చిక్కని చీకటిలో అంతకంటె చిక్కగా మంచులా బిగుసుకుపోయిన ఒక ఆకారం రోడ్డుకు అడ్డంగా పడివుంది. కారు హెడ్‌లైట్ల కాంతి క్రమ క్రమంగా విస్తరిస్తూ అక్కడ ఆగిపోయింది. కార్లో కూర్చున్న హరనాథ్‌కు ముచ్చెమటలు పోశాయి. చటుక్కున బ్రేకు వేశాడు.

"ఏమయింది హరీ?" నాజూగ్గా అడిగింది విజయ.

"ఏమీలేదు" అతని కంఠంలో వణకు స్పష్టంగా విన్పించింది. గబాలున అతని వడిలోంచి లేచింది విజయ. ముందుకు చూసి భయంగా అతన్ని గట్టిగా పట్టుకుంది.

భయపడ వద్దన్నట్టుగా ఆమె చేయి తట్టి మెల్లగా డోర్ తెరిచాడు.

"వద్దు హరీ! మనం వెనక్కి వెళ్ళిపోదాం" బెరుగ్గా అతని చేతిని లాగింది.

"విజయా! ప్లీజ్! నన్ను అడ్డుపెట్టకు. ఒక వ్యక్తి ప్రాణాపాయస్థితిలో వుంటే రక్షించటం తోటి మానవులుగా మన కర్తవ్యం." సౌమ్యంగా అన్నాడు.

"అసలు బ్రతికివున్న మనిషేనా!" వణకుతూ గొణిగింది విజయ.

ఆ మాట విన్పించుకోనట్టుగా హరనాథ్ ముందుకు నడిచాడు. అతని నర నరాల్లోంచి వణకు పుడుతూంది. అయినా తమాయించుకుని మోకాలిమీద కూచుని ఆ ఆకారాన్ని పరీక్షగా చూశాడు. ఎవరో స్త్రీ! బోర్లాపడి వుంది. శ్వాస ఆడుతున్నట్టుగా ఛక్కలు ఎగిరి పడుతున్నాయి. చీర, అక్కడక్కడా చినిగి పోయింది. జుట్టంతా మొహంనిండా పరుచుకుంది. హరనాథ్‌కి చటుక్కున చేయవలసిన కర్తవ్యం గుర్తొచ్చింది. పాపం! ఈవిడనో హాస్పటల్‌కి తీసుకెళ్ళాలి. మనసులో దృఢంగా నిశ్చయించుకున్నాడు.

"విజీ! కాస్త దిగిరా!" కేకేశాడు.

"అమ్మో! నేను రాను" గట్టిగా అంది

విజయ కారులో వుంది.

ఆమె భయానికి చిన్నగా నవ్వుకుని మెల్లగా, స్పృహతప్పిన ఆ స్త్రీని రెండు చేతులా ఎత్తుకున్నాడు. అప్రయత్నంగా ఒళ్ళంతా ఆదోలా కంపించింది. బలంగా అడుగులేస్తూ కారు వైపు నడిచాడు.

విజయకి కాస్త ధైర్యం వచ్చి, బ్యాక్ డోర్ తెరచి తయారుగా వుంచింది. మెచ్చుకోలుగా ఆమెను చూసి, చేతుల్లో వున్న స్త్రీని సీటులో పడుకోబెట్టాడు. కారులోపలి లైటు వెలుగులో దగ్గరగా ఆమె మొహం చూసి ఉలిక్కి పడ్డాడు. అప్రయత్నంగా చేతులు వణికాయి. గుండెల్లో రైళ్ళు పరిగెత్తుతున్నట్లు పీలయ్యాడు. 'ఓ. మైగాడ్.' బాధగా నుదురు రుద్దుకున్నాడు. అతని ఎర్రని మొహం ఇంకా ఎర్రగా జేవురించింది. ఎవరో తరిమినట్టుగా చటుక్కున డోర్ మూసి స్టీరింగు ముందుకు వచ్చి కూచున్నాడు. మరు నిమిషంలోనే రివ్వుమని బాణంలా దూసుకుపోయింది కారు. స్టీరింగు పట్టుకున్న అతని చేతులు అదురుతున్నాయి. కాలు ఆక్సిలేటర్‌ను బలంగా తొక్కుతూంది.

హరనాథ్‌లోని ఆకస్మిక మార్పుకి కారణం తెలియక అయోమయంగా—కారు వేగానికి గట్టిగా కళ్ళు మూసుకుంది విజయ.

డ్రైవ్ చేస్తున్న హరనాథ్‌కి మిర్రర్ లోంచి వెనక సీటులో అచేతనంగా వున్న ఆమె మొహం స్పష్టంగా కన్పిస్తూంది.

రైలింజనులా పరిగెత్తుతున్నఅతని ఆలోచనలకు కణతలు అదిరిపోతున్నాయి. 'వాణి! వాణిఇక్కడ-ఈ రూపంలో ఎలా ప్రత్యక్ష్యమయింది! తనలో మొదటి సారిగా వలపు వీణను పలికించిన వాణి ఈ స్థితిలో వుందేమిటి?' కారు కాలంతో పోటీ పడుతూ ముందుకు వేగంగా సాగుతుంటే, అంతకంటే వేగంగా ఆలోచనలు గతం లోకి జారిపోయాయి.

*

"ఏమిటండీ, అలా చూస్తున్నారు!" కిలకిలా నవ్వింది వాణి. లైటు వెలుగులో ఆమె కళ్ళు తమాషాగా మెరిశాయి.

తదేకంగా ఆమెనే చూస్తున్న హరనాథ్ తడబడి, "అహ! — ఏంలేదు. ఏంలేదు!" అంటూ నుదుట పట్టిన చెమట తుడుచుకున్నాడు. అతని అవస్థ చూసి చిన్నగా నవ్వింది వాణి. "మీరు!....మరీ బిడియపడుతున్నారే! కాఫీ తీసుకోండి."

కంపిస్తున్న చేతులతో కాఫీ అందుకున్నాడు.

"మీరు వచ్చిన సమయానికి నాన్న వూళ్ళో లేనందుకు బాధగావుంది. మీ చిన్నప్పటి మేష్టారుని గుర్తు పెట్టుకుని వచ్చినందుకు చాలా సంతోషంగా వుంది" ఆమె కళ్ళు చిత్రంగా మెరిశాయి.

"అది నా దురదృష్ట మనుకుంటాను. మేష్టారుని చూడాలని ఎంత తహ తహ పడ్డానో! అంత నిరాశ ఎదురయింది" కొద్దిగా ఫ్రీగా మాట్లాడసాగాడు. "అప్పుడు మీరింకా చిన్నవారు. బహుశ నేను గుర్తుకు రాకపోవచ్చు. ఒకసారి మీరు జామకాయలు కావాలని ఏడుస్తుంటే తెంపాలని చెట్టెక్కి కాలు జారి పడిపోయాను. ఇదిగో! ఆగాయం ఇప్పటికీ వుంది." షర్టు పైకి లాగి మోచేతిమీద గాయం మచ్చ చూపించాడు.

సానుభూతిగా చూసి చిన్నగా నవ్వుకుంది వాణి.

మేష్టారు తన అభివృద్ధికి ఎలా కారకులయ్యారో, తాను చేసే అల్లరికి ఎన్ని దెబ్బలు తినేవాడో, ఈ సంగతులన్నీ చెపుతుండగానే కాలం గడిచిపోయింది.

"అరె! చాలా పేళయింది. ఇది చూస్తూ కూచోండి. పది నిముషాల్లో వంట రెడీ చేస్తాను" మేగజైన్ అతని ముందు పడేసి లేచింది.

"ఆగండి! ఇహ నేను వెళ్ళిపోతాను."

"వెళ్ళిపోతారా? ఈ రాత్రి ఎలా వెళ్తారు? ఇటునుండీ ఏ బస్సూలేదని తెలుసుగా! అయినా లాస్ట్ బస్‌కయినా నాన్న వచ్చేస్తారు. అది ఇక్కడ హాల్ట్ చేస్తుంది. ఇంతదూరం వచ్చిన అతిథికి మర్యాద చేయకుండా పంపిస్తానా?" గడగడ మాట్లాడి జవాబు ఆశించకుండా లోపలికి నడిచింది.

"అసాధ్యురాలే!" భుజాలెగరేసి సోఫా వెనక్కి వాలాడు. కొన్ని నిముషాలు బరువుగా గడిచాయి. ఇంతలో లోపలినుండి కెవ్వుమని కేక విన్పించటంతో ఉలిక్కిపడి లోపలికి పరిగెత్తాడు. వంటింట్లో ఆ దృశ్యం చూసి నిర్ఘాంతపోయాడు హరనాథ్. వాణి కొంగు భగభగమని మండిపోతూంది. భయంతో ఆమె కేకలు వేస్తూ చీరని లాగేయాలని చూస్తూంది.

అతనికి ఏం చేయాలో తోచలేదు. ఓ చేత్తో ఆమెని గిరగిరా తిప్పుతూ, ఇంకో చేత్తో చీరని లాగిపారేశాడు. వాణి గుండెలు అదురుతుంటే కాలి మసయిపోతున్న చీరను చూసి కళ్ళు గట్టిగా మూసుకుంది. ఆమెకు మాత్రం ఏమీ జరగలేదు!

లంగా, జాకెట్‌లో వున్న ఆమెను చూస్తుంటే హరనాథ్‌కి మతిపోతున్నట్టనిపించింది. మనసు అతని స్వాధీనం తప్పిపోయింది. ఆ తర్వాత.... తర్వాత....

*

కారు స్టీరింగుమీది హరనాథ్ చేతులు బిగుసుకున్నాయి.

"హరీ? ఏమిటిది! సిటీలోకి వచ్చినా స్పీడ్ తగ్గించటం లేదు." కంగారుగా అరచి అతని భుజం కుదిపేసింది విజయ.

తల విదిలించి కలలోంచి చూసినట్టు చూశాడు. విజయ మసక, మసకగా కన్పించింది. అప్పుడు అతనికి కర్తవ్యం గుర్తుకు వచ్చింది. సీటు వెనక అచేతనంగా పడివున్న వాణిని చూసి భారంగా నిట్టూర్చి తమ డాక్టర్—రఘునాథ్ డిస్పెన్సరీ ముందు కారాపాడు.

"వ్వాట్ హాపెన్డ్!" నిద్రలో నుండి లేచి కళ్ళు నులుముకుంటూ వచ్చాడు డాక్టరు.

"డాక్టర్! మేము సాగర్ వెళ్ళి వస్తుండగా, ఈవిడ అపస్మారక స్థితిలో రోడ్డుకు అడ్డంగా పడవుంది. దయచేసి ఆవిడ పరిస్థితి ఎలా వుందో చెప్పండి!" జేబు రుమాలుతో తుడుచుకుంటూ మొహంలోని భావ సంఘర్షణ బైట పడకుండా జాగ్రత్త పడ్డాడు.

"అలాగా! మీరు కూచోండి. నర్స్!" గట్టిగా కేకేశాడు.

కొన్ని నిమిషాలు కరుకుగా నడిచిపోయాయి. గది తలుపులు తెరచుకున్నాయి. బైటికి వచ్చిన డాక్టర్ కళ్ళు-బాధతో చలిస్తున్నాయి.

"హరనాథ్‌గారూ!" భారంగా పిలిచాడు.

ఆత్రుతగా చూశారు విజయా, హరనాథ్‌లు.

"పాపం. ఆవిడను ఇద్దరు లేక ముగ్గురు.... రేప్ చేసినట్లు తెలుస్తూంది."

"డాక్టర్!" అప్రయత్నంగా అరిచాడు హరనాథ్.

"పాపం!" విజయ సానుభూతి వ్యక్తం చేసింది.

"డాక్టర్! ఆవిడ ప్రాణానికేం అపాయం లేదు కదా!" ఆత్రంగా అడిగేడు.

"పరిస్థితి కాస్త తీవ్రంగానే వుంది. దైవాధీనం."

"డాక్టర్! ప్లీజ్! ఆవిడనెలాగయినా కాపాడండి!" ప్రాధేయపూర్వకంగా డాక్టర్ చేతులు వూపివేశాడు.

డాక్టర్ విచిత్రంగా చూసి "అదేమిటండీ! మీరింతగా చెప్పాలా? నా శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తాను." తిరిగి లోపలికి పోయాడు.

మెదడంతా మొద్దుబారగా, అచేతనంగా అలాగే సోఫాలో కూలబడ్డాడు హరనాధ్. రెండు చేతులతో మొహం కప్పుకుని కూచున్నాడు.

విజయ అతన్ని పలకరించాలనుకుంది. కాని అతని మొహం చూసి, సాహసించలేకపోయింది.

కాసేపు చూసి, "హరీ! నేను యింటికి వెళ్ళనా!" ఆమెకు అలసటగా వుంది ప్రయాణం వల్ల. మనసు విశ్రాంతి కావాలంటూంది. హరనాధ్ విన్పించుకున్నట్టు లేదు.

"ఉదయమే టీ తీసుకుని వస్తాను." ఈసారి సమాధానానికాశించకుండా గదిలోకి వెళ్ళి వాణిని చూసింది.

స్పృహ లేకుండా వుంది వాణి. జాలిగా ఆమె తల నిమిరి ఇవతలికి వచ్చింది. రిక్షా తీసుకుని ఇంటికి వెళ్ళిపోయింది విజయ.

"మిష్టర్ హరనాధ్! షి యాజ్ ఆల్‌రైట్! ఇప్పుడు ప్రమాదం గడిచినట్టే! ఇప్పుడే స్పృహ వచ్చింది!" డాక్టర్ కంఠం విని సోఫాలో కూచున్న హరనాధ్ ఉలిక్కిపడ్డాడు. టైం చూశాడు. ఏడు గంటలు. తూరుపు తెల తెలవారుతూంది. 'విజయ ఎప్పుడు ఇంటికి వెళ్ళిందో?' అనుకుంటూ నెమ్మదిగా ఒళ్ళు విరుచుకుని లేచాడు.

డాక్టరు అతనివేపు మెచ్చుకోలుగా చూస్తూ "నిజంగా మీలాంటి దయగలవారు ఇంకా వున్నారంటే సంతోషంగా వుంది. ఎవరో ముక్కూ మొహం తెలియని వ్యక్తికి వైద్యం చేయించి, పైగా, రాత్రంతా మేలుకుని వున్నారు."

హరనాధ్ మొహం వివర్ణమయింది. "నేను చేసిందేముంది – నా స్థానంలో ఎవరున్నా ఈపాటి సహాయం చేస్తారు" గబగబ వాణి వున్న గది వైపు నడిచాడు."

గదిలోకి అడుగుపెడుతుంటే గుండె దడదడా కొట్టుకోసాగింది.

మంచం మీద వాణి–వడలిన మల్లెపూవులా వుంది. నీరసంగా కళ్ళు మూసుకుని వుంది.

"వాణీ!" పిలిచాడు హరనాధ్. తన స్వరంలో తనకే వెలితి కన్పించింది.

మెల్లగా కళ్ళు తెరచింది వాణి. హరనాధ్‌ను చూస్తూనే విషనాగును చూసినట్టు భయంతో ఉలిక్కిపడింది.

"నువ్వు....నువ్వు...." నూతిలో నుండి వస్తున్నట్టుగా వుంది ఆమె మాట.

హరనాధ్ తడబడ్డాడు. "అవును....వాణీ! నేనే హరిని...." అంతకంటే ఏమీ మాట్లాడలేకపోయాడు.

"ఎందుకు?....ఎందుకు నన్ను రక్షించావ్! ఇంకా నాలో ఏముందని?" నీరసంగా వున్న చెక్కిళ్ళపై నుండి నీళ్ళు ధారలు కట్టాయి.

"వాణీ!" ఆదుర్దాగా దగ్గరికి వచ్చాడు.

"నన్ను....నన్ను క్షమించు వాణీ!" గొంతు గద్గదమయింది.

బాధగా, పేలవంగా నవ్వింది వాణి. "హరీ! ఏమన్నావూ....క్షమించడమా, నిన్ను క్షమిస్తే పోయిన శీలం తిరిగి వస్తుందా? ఇన్నాళ్ళూ పడిన నిందలు మాసిపోతాయా?" ఆమె ఆవేశపడ్తున్నట్లు స్పష్టంగా తెలుస్తూంది.

హరనాధ్ బాధగా చూస్తూ "వాణీ! నీ జీవితమిలా కావటానికి...." మధ్యలోనే అతన్ని ఆపింది. "కారణం నువ్వు! క్షణికోద్రేకంతో చేసిన నీ పొరపాటు నా గ్రహచారం. నన్ను.... నమ్మించి....పెద్దలని ఒప్పించి పెళ్ళి చేసుకుంటానని మాట ఇచ్చి పారిపోయిన పిరికివాడివి నువ్వు....నీ కొరకు ఎంతగా ఎదురుచూశాను.... నాన్నను బలి తీసుకున్నాను....ఆఖరికి ఇప్పుడు... ఇప్పుడు...." దుఃఖంతో కంఠం పూడుకుని పోయింది. రెండు చేతులతో మొహం కప్పుకుంది.

"వాణీ"

"దయచేసి వెళ్ళిపో హరీ! నా ముందు వుండకు వెళ్ళు!" అరచింది శక్తి కూడదీసుకుని. బ్లాంకెట్ తలనిండా కప్పుకుంది.

ఇంకేమీ చేయలేక భారంగా బైటికి నడిచాడు ఎదురుగా వస్తున్న డాక్టర్‌తో.

"డాక్టర్! ఆమెను చాలా శ్రద్ధగా ట్రీట్ చేయండి. ఎంత ఖర్చయినా ఫర్వాలేదు. చాలా సెన్సిటివ్ ఆమె!"

రఘునాధ్ ఆశ్చర్యపోతూ "ఆవిడ మీకు తెలుసా?" అన్నాడు.

జవాబివ్వకుండా తల వంచుకుని గబగబా నడుస్తున్న హరనాధ్‌ను చూస్తూ ఇంకా ఆశ్చర్యపోయాడు.

*

"ఏమిటీ? ఆవిడ నీకు తెలుసా?" నెమ్మదిగా అడిగింది విజయ. మౌనంగా తల వూపేడు. అంతకన్నా ఏమీ చెప్పలేకపోయాడు హరనాధ్. అతని మొహమంతా స్వేద బిందువులతో వాడిపోయింది. విపరీతమైన భావ సంఘర్షణ మొహంలో స్పష్టంగా కన్పిస్తూంది. నౌకరు రంగయ్య ట్రేలో టీలు తెచ్చి టేబుల్ మీద పెట్టి వెళ్ళాడు. విజయ నిర్లిప్తంగా, శూన్యంలోకి చూస్తూ వుండి పోయింది. 'హాస్పటల్లో వున్న ఆమెకు,

## వార్తలు

రాజమండ్రిలోని లయన్ లేడీస్ క్లబ్‌వారు ఈమధ్య ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూలు సంచులు పంచిపెట్టారు. అలాగే, రాజానగరంలో ఉచిత నేత్ర చికిత్స శిబిరం ఏర్పాటు చేసి, చాలామందికి చికిత్సలు చేయించారు. లయన్ లేడి శ్రీమతి వాళం సీతారత్నం-కళ్ళజోళ్ళను బహూకరించారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ సందర్భంగా, అనాథ శరణాలయంలోని బాలబాలికలకు కొత్తబట్టలు కుట్టించారు.

*

విశాఖపట్నంలో డాబాగార్డెన్సుకు చెందిన ఉమెన్స్ యిండియన్ అసోసియేషన్ నవంబరు నెల 29 వ తేదీన మిసెస్ మార్గరెట్‌కజిన్స్ శత వార్షిక జయంత్యుత్సవాల సందర్భంగా సభ జరుపుకున్నది. అనేకమంది మహిళలు హాజరయిన యీ సభకు శ్రీమతి రామాదేవి భానోజీరావు అధ్యక్షత వహించారు. పి. జగన్మోహిని సభకు హాజరయిన అతిథులను పరిచయం చేసి, సభాసదులకు స్వాగతం పలికారు. విశాఖ విమెన్స్‌కాలేజీ ప్రిన్సిపాల్ డా॥ ఎన్. పుత్తిలిబాయి, డా॥ సి. కాంతమ్మ, కుమారి బాగంటి తులసి మొదలైనవారు ప్రసంగించారు. కార్యదర్శి శ్రీమతి లీలానాయుడు వందన సమర్పణ చేశారు.

హరనాథ్‌కు గల సంబంధం ఏమిటి?' ఆవిడ మెద డంతా చెదలుతినేస్తున్నట్టుగా వుంది. టీ పొగలు కక్కుతూంది.

'అందరిని కాదని హరనాథ్‌తో వచ్చేసింది. అతని నీడలో జీవితమంతా గడపాలని. ఎన్నో కలలతో ఇల్లుదాటి వచ్చింది. అందరి స్త్రీల లాగే తనూ మోసపోయిందా?' ఆమె గుండె వేగంగా కొట్టుకోసాగింది. ప్రక్కకి తిరిగి హరనాథ్‌ని చూసింది. అతడు అశాంతిగా కణతలు వత్తు కుంటున్నాడు. కప్పుల్లో టీ చప్పగా చల్లారి పోయింది. హరనాథ్‌కి ఆలోచనలు పుట్టలు, పుట్టలుగా వస్తున్నాయి.

ఏదో చేయాలి అని ఆరాటంగా వుంది. ఏదీ చేయలేని పరిస్థితిలో వుండిపోయాడు. విజయ వున్నదన్న ఆలోచనే అతను భరించలేకపోతు న్నాడు, తనకోసం, ఇల్లు వదలిన విజయా, ఆమె ప్రేమా జ్ఞాపకం వచ్చి చలించిపోయాడు.

వాణి! వాణిని తను ప్రేమించాడు. అనుభవిం చాడు....పెళ్ళాడలనుకున్నాడు. కాని, వూరికి వెళ్ళేసరికి, పక్షవాతంతో పడిపోయిన నాన్న. ఎదిగిన చెల్లెలు, అప్పులు. ఈ గొడవల్లో వాణి జ్ఞాపకం రాలేదు. వచ్చినా పరిస్థితులు కదలనివ్వ లేదు. తీరా అన్నీ చక్కబరుచుకుని వెనక్కి తిరిగి కాలాన్ని కొలిస్తే రెండు సంవత్సరాలు దాటిపోయాయి. ఒక్కరోజు అనుభవంతో ఇంకా వాణి నా కొరకు ఎదురు చూస్తుందా? ఈ పాటికి పెళ్ళిచేసుకుని వుండవచ్చు అనుకున్నాడు. చివరి ప్రయత్నంగా ఆ వూరు వెళ్ళాడు. గుండె పోటుతో మేష్టారు చనిపోయాడని, వాణిని ఎవరో బంధువులు తీసికెళ్ళారని తెలిసింది. తిరుగు ప్రయాణంలోనే విజయతో పరిచయం జరిగింది. ఆమెదీ హైద్రాబాదే కావటంతో పరిచయాలు ఎక్కువైనాయి. ఉద్యోగంలో తనకీ హోదా వచ్చింది. విజయ తనకు తోడుగా రావటానికి నిశ్చయించుకుంది. తనవాళ్ళని ఎదిరించి వచ్చింది. రిజిష్టర్డ్ మ్యారెజ్‌కి అన్నీ సిద్ధం చేసుకున్నారు. ఇంకా రెండు రోజులు గడువుంది.

'నేను వాణికి ఏమీ అన్యాయం చేయలేదు. నా ప్రయత్న లోపమయినా లేదు. విధి వ్రాసిన ఖర్మ ఎవరు తప్పిస్తారు! వాణి ఖర్మ అది' తనను తాను సమర్థించుకున్నాడు.

"నువ్వు వాణికి అన్యాయం చేయలేదూ!" అంతరాత్మ గర్జనకు ఉలిక్కి పడ్డాడు.

"నిజంగా వాణిని పెళ్ళాడాలనుకున్న వాడ వయితే, రెండు సంవత్సరాలు చేతులు ముడుచు కుని కూచోవు. నీ పరిస్థితంతా ఆవిడకి ఉత్తరం ద్వారా తెలిపేవాడివి. అన్ని రోజులూ, ఈ సంఘంలో చాకుల్లాంటి మనుషుల మధ్య వాణి ఏ ఆశతో ఎదురు చూస్తుందనుకున్నావ్?' నిలదీ సింది మనసు.

"నా బాధలన్నీ తెలిపి వాణిని బాధ పెట్టటం ఇష్టం లేక...."

'ఛీ! ఇంకా చేసింది చాలక సమర్థించుకుంటు న్నావా? నీవు చేసిన ఘోరమైన పొరపాటుకు జీవితమంతా ఆమె బలికావల్సిందేనా? ఒక్కటే మార్గం! వాణి ఆరోగ్యం బాగుకాగానే ఇంటికి తీసుకురా! పెళ్ళి చేసుకో"

"ఇంపాజిబుల్! ఒక చెడిపోయిన...."

"షటప్! ఆమాట అనటానికి నీకు అర్హత లేదు. ఆమె జీవితం నాశనం కావటానికి కారణం నువ్వు. ఆ పొరపాటు జరిగి వుండకపోతే ఆమె పెళ్ళి ఎవరితోనో జరిగి పోయేది. సలక్షణంగా కాపురం చేసుకునేది. మూర్ఖుడా! ఇంకా ఆలో చిస్తావేం? నీలో మానవత్వం లేదా? దయ అనేది కరిగిపోయిందా?" గడగడ కదిగేసింది అంతరాత్మ.

హరనాథ్‌కి ముచ్చెమటలు పోశాయి. తడబడు తున్న కాళ్ళతో కిటికీ దగ్గరకు నడిచాడు. రివ్వు మని గాలి వీచింది. కూజాతో నీళ్ళు వంపుకొని గడ గడా గ్లాసెడు నీళ్ళు తాగేసి చెమట తుడుచు కున్నాడు. తిరిగి కూచున్నాడు.

అవును! తను దుర్మార్గుడు. మోసగాడు! వాణి! తన తొలిప్రేమ దేవత. వాణి బలికావ డానికి వీల్లేదు. మోడువారిపోతున్న ఆమె జీవి తాన్ని తిరిగి పుష్పింపచేస్తాను....'వాణీ! నన్ను క్షమించు! నిన్ను పెళ్ళిచేసుకుంటాను' అనుకో గానే ఎక్కడాలేని సత్తువ వచ్చింది. మరు క్షణమే చప్పగా చల్లారిపోయాడు. తనకోసం అందరినీ వదులుకున్న విజయనేం చేయాలి?" ఈమె జీవితం నాశనం చేస్తునట్టుకాదా? ఈమెను మోసంతో బలి చేస్తునట్టుకాదా? చెప్పవేం?' గద్దించాడు....అంతరాత్మ మౌనంగా వూరుకుంది. పిచ్చిగా జుట్టులో వ్రేళ్ళు పోనిచ్చాడు. బావిలో దూకి చనిపోవడమే పరిష్కార మన్పించింది. ఆ క్షణంలో ఏదీ నిర్ణయించుకోలేని అయో మయంలో పడిపోయాడు.

అడుగుల చప్పుడు విని కళ్ళు తెరచింది వాణి. విరసనగా చూసింది.

"వాణీ!" ఆప్యాయంగా పిలిచాడు.

అసహ్యంగా చూసింది. "ఇంకా ఏముందని బ్రతికిస్తున్నావ్! నన్ను చావటానికి వీల్లేకుండా చేశావ్! నా జీవితంతో ఆడిన ఆట చాల్లేదా?" కసిగా పక్కనున్న ఆపిల్‌పండును విసిరేసింది.

ఆ చేయిని అలాగే అందుకుని ఆప్యాయంగా నిమిరేడు.

"నీ జీవితంతో ఆటలాడటానికి కాదు. నీ బ్రతుకొక్క బాట ఏర్పరచాలని." పకపక నవ్వింది వాణి. "నా జీవితానికి బాట ఏర్పరుస్తావా? పూలబాటలాంటి జీవితంపై ముళ్ళుపరిచి వెళ్ళావు. ఆ ముళ్ళన్నీ గుచ్చుకుని, విషమంతా ఒంటికి దిగాక....ఇప్పుడు....ఇప్పుడు....నా జీవితానికో బాట ఏర్పరుస్తావా?" దుఃఖంతో మాట్లాడలేక పోయింది.

"నిజం వాణీ! నన్ను నమ్ము! నిన్ను పెళ్ళి చేసుకుంటాను." ఉద్వేగంతో అతని గొంతు వణికింది.

కొత్తమాట వింటున్నట్టు వింతగా చూసింది వాణి.

"దేవుని సాక్షిగా చెబుతున్నాను. నువ్విలా కావటానికి కారణం నేను....నేను చేసిన ఘోర మైన తప్పును సరిదిద్దుకోనీ...." ప్రాధేయ పూర్వకంగా చూశాడు.

"హరీ! ఇది జీవితం. సినిమా కాదు. హఠాత్తుగా నీకు ఇంతటి విశాలహృదయం ఎలా వచ్చిందో ఆశ్చర్యంగా వుంది. నేను ఎటువంటి పరిస్థితిలో నీకు తటస్థపడ్డానో తెలుసా?" ఆమె కంఠం కంపించింది.

"తెలుసు! అన్నీ ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. నిన్ను పెళ్ళి చేసుకోవటానికి నేను...."

"నేను మాత్రం సిద్ధంగా లేను హరీ! లేని పోని త్యాగాలతో పెళ్ళి చేసుకుని ప్రత్యక్ష నరకం అనుభవించలేను. నా గమ్యాన్ని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను."

"వాణీ! బాగా ఆలోచించు! నీ అందం అడివికాచిన వెన్నెలకాకూడదు."

"హరీ!" తీక్షణంగా చూసింది. "నన్ను నేలవేసి కాలరాచిన నీకు ఆ మాట అనే అర్హత లేదు. నేను కోరుకునేది ఒకటే! ఇంకెవ్వరి జీవితాలతోనూ ఆటలాడకు. కాని....హరీ!

నా కలలు, ఆశలు బూడిదపాలు చేసిన నువ్వు.... దానికి తగ్గ శిక్ష అనుభవిస్తావ్! వెళ్లు! వెళ్లు!..." ఆవేశంగా అరచి బావురుమంటూ మొహం పక్కకు తిప్పుకుంది.

హరనాథ్ శిలలా కూచుండిపోయాడు.

"ఇంకా వున్నావేం!" కటువుగా వుంది వాణి స్వరం.

మెల్లగా లేచి బైటికి నడిచాడు బొమ్మలాగ. తను పెళ్ళి చేసుకుంటాననగానే, కృతజ్ఞతతో, ఆనందంతో అంగీకరిస్తుందనుకున్న అతనికి అశనిపాతంలా తగిలాయి ఆమె మాటలు.

"హల్లో! హరనాథ్! వాణి నా దగ్గర నర్సుగా చేరుతానంటూంది. మీరేమంటారు?" ఎదురువచ్చిన డాక్టర్ మాటలతో ఈ లోకానికి వచ్చాడు. అర్థం చేసుకోవటానికి ఒక నిమిషం పట్టింది. "డాక్టర్! ఆవిడకెలాగైనా ఆ ఉద్యోగం ఇప్పించండి. జీతం మీరేమీ ఇవ్వక్కర్లేదు. చెక్కు వ్రాసిస్తాను. నెలనెలా ఆవిడకివ్వండి" గబగబ అన్నాడు.

"వాణి నాకు అన్ని విషయాలూ చెప్పింది. శ్రమకు తగ్గ ఫలం మేమెలాగూ ఇస్తాం. మీ డబ్బు మీరే స్వయంగా అందచేస్తే బావుంటుందేమో" వ్యంగ్యమో ఏదో తెలియని విధంగా నెమ్మదిగా అన్నాడు డాక్టర్.

అవమాన భారంతో అతని తలవంగిపోయింది. నడుస్తున్నాడన్న మాటేకాని మనసు ఆలోచిస్తూనే వుంది. 'ఇంటి దగ్గర విజయ ఎదురు చూస్తుందొచ్చు' ఆమె జ్ఞాపకం రాగానే ఎంతో రిలీఫ్‌గా ఫీలయ్యాడు. తెలియని శృంఖలాలు వీడిపోయినట్టు స్వేచ్ఛగా గాలిపీల్చాడు.

'ఆధారం కల్పించాలనుకున్నాడు. కాదనటం ఆమె తప్పు. తనదేమీ లేదు. చేసిన తప్పుకు పశ్చాత్తాపపడుతున్నాడు కాబట్టి పాపం తనకు అంటదు' రెండు చేతులతో మెడవిరుచుకుని తేలికగా నిట్టూర్చి సీటుకి జేరగిలబడ్డాడు. కారు మెత్తగా సాగిపోయింది. విజయ ఇంట్లో ఏం చేస్తూందో? విజయ జ్ఞాపకం రాగానే అతనిలో ప్రేమ–కెట్టలు తెంచుకుంది. ఇన్ని రోజులు తన ప్రవర్తనకి ఏమని భాష్యం చెప్పుకుందో?.... రేపే....రిజిష్ట్రార్ ఆఫీసుకు వెళ్ళాలి. విజయని తనదిగా చేసుకోవాలి. ఏదో తెలియని భావోద్వేగం కల్గింది. కారు మలుపు తిరిగింది. అంతే.... ఆ తర్వాత ఏం జరిగిందో అతనికి తెలియదు.



బెండకాయ వేపుతున్నప్పుడు జిగురొచ్చి, కూర ముద్దలా అయిపోతుంది. బాణలిలో ముక్కలు వెయ్యగానే, కాస్త మజ్జిగ కూడా వేసి కలిపితే–జిగురు రాదు. —టి. శైలజ

కళ్ళు తెరచేసరికి బెడ్ మీద వున్నాడు. అయోమయంగా చూశాడు.

అతను కదలటం చూసి డాక్టర్ దగ్గరగా వచ్చాడు.

"డాక్టర్! ఏమిటి? ఏమయింది నాకు?"

"మీ కారు మలుపు తిరుగుతూ అటునుండి వస్తున్న లారీకి గుద్దుకుంది. లారీడ్రైవర్ పారిపోయాడు. మిమ్మల్ని ఎవరో ఈ హాస్పిటల్లో చేర్చి వెళ్ళారు. కాస్తలో తప్పిపోయింది కాని మీరు, కారు నుగ్గునుగ్గయిపోయేవారు." వివరించాడు డాక్టరు.

హరనాథ్ తన్ను తాను చూసుకున్నాడు. తలకు బాండేజి వుంది. చేత్తో తడమబోయాడు. చేయి కదలలేదు.

"డాక్టర్!" భయంగా చూశాడు.

"సారీ! మిష్టర్! చేతి ఎముక విరిగిపోయింది. గాయం బాగా తగిలింది. అంతవరకూ తీసేయకపోతే ప్రమాదం. మీవాళ్లెవరైనా వున్నారా? అడ్రసివ్వండి."

పిచ్చిగా చూసేడు హరనాథ్ "మావాళ్ళా.... వున్నారు. డైరీ వుంది చూడండి అడ్రసు, ఫోన్ నెంబరు" అప్రయత్నంగా అన్నాడు. విజయ ఎంత బాధపడుతుందో? ఒక్క రెండు గంటల్లోనే ఎంత అనర్థం జరిగిపోయింది! బాధగా కళ్ళు మూసుకున్నాడు. 'తనను భగవంతుడెంత దురదృష్టహీనుణ్ణి చేశాడు!'

"అయ్యగారూ!"

ఆలోచనల్లోంచి తేరుకుని చూశాడు. ఎదురుగా రంగయ్య నిలబడ్డాడు.

"అయ్యగారూ! ఎంతపని జరిగింది! సమయానికి విజయమ్మగారు ఇంట్లో లేరు. ఈ ఇసయం, తెలవంగనే ఉరుకొచ్చిన." బాధగా అన్నాడు. హరనాథ్ ఆశ్చర్యంగా చూసి "విజయ లేదూ!"

"లేదు బాబూ. ఇదిగో ఈ చీటి ఇచ్చి పోయారు. మీరు రాంగానే ఇమ్మన్నారు" బనీను జేబులోంచి కాగితం తీసి ఇచ్చాడు.

ఎడమచేత్తో తీసుకున్నాడు. అతి కష్టమ్మీద విప్పి ఆత్రుతగా చదివేడు.

"హరీ!

నన్ను మోసం చేశావని అనను. కాని వాణి విషయం నాతో ముందే ఎందుకు చెప్పలేదు? ఆమె కలిసాక కూడా ఆ రహస్యాన్ని దాచావు.

నీ అశాంతికి, ఆవేదనకి కారణం తెలియక, తప్పని తెలిసినా నీ డైరీలు తీసి చదివాను. అన్ని విషయాలూ తెలిశాయి.

హరీ! నిజంగా నువ్వెంత నీచుడివి! వాణిని పెళ్ళాడాలని నిశ్చయించుకున్న నువ్వు, నన్నింకా ఇంట్లో ఎందుకు వుంచావు? ఉంపుడుకత్తెలా వాడుకోవాలనుకున్నావా? లేక వాణి ఒప్పుకోకపోతే నన్ను పెళ్ళాడొచ్చులే అని ఆగిపోయావా? ఆడవాళ్ళంటే అంత తేలికనుకున్నావా?

ఛీ! నీలాటి మనస్తత్వమున్న మగవాణ్ణి ఏ ఆడదీ భరించలేదు, ప్రేమించలేదు. ప్రేమించినా జీవితంలో రాణించదు. ఒక్క విషయం మాత్రం గుర్తుంచుకో! జీవితమంటే స్థిరమైన అభిప్రాయమున్నప్పుడే జీవితానికో విలువ, ఆ బ్రతుక్కో అర్థమూ వుంటుంది. చంచల వ్యక్తిత్వంతో ఎటు గాలివీచితే అటు కొట్టుకుపోయే మనస్తత్వంతో ఎటూగాకుండాపోతావు.

నీవు వాణిని చేసుకుంటాననుకోవటం నాకు చాలా సంతోషంగా వుంది. కాని, వాణిలో ఏమాత్రం అభిమానమున్నా నీవిస్తున్న చేయి అందుకోదని నా నమ్మకం. అదే నిజమయితే తిరిగి నాకొరకు ఆశతో వచ్చి వుంటావు. నా తిరస్కృతి కూడా నీ మనసుపై పెద్ద దెబ్బ తీస్తుండవచ్చు. నీలో లవలేశమైనా మానవత్వముంటే మానసికంగా కృంగిపోతావు. చాలు. నీకి శిక్ష చాలు.

గుడ్‌బై

నాకొరకు ప్రయత్నించకు!

విజయ—"

గుండెలో అగ్ని పర్వతాలు ఫెటీలుమని పగిలినట్టు వ్యథ చెందాడు హరనాథ్. విజయ వ్రాసిన అక్షరాలు — భూతాల్లా పెరిగి, పెరిగి పోతున్నాయి. □